# లక్ష్మి వుత్తరం

ఇంకమీమొహాన్నియీజన్మానికి చూడననుకుంటే; మీరు మన సల్లాపాలూ, ప్రేమా, అన్నీ మరచిపోతారనుకుంటే; కొద్దిరోజుల్లో మళ్ళీ పెళ్ళిచేసుకుని, నన్ను పిలిచిన ముద్దుపేర్లన్నిటితోనూ ఇంకెవర్నో పిలిచి, నా బుగ్గమీద వేళ్ళేసేట్టే అట్లానే దాని బుగ్గమీదవేసి లాలిస్తా రనుకుంటే యెంతో బాధ కలుగుతుంది. వారంరోజులనుంచి ఆలోచించుకుని, ఆలోచించుకుని యీ బాధంతా రాత్రింబవళ్లు మనసులో అనుభవించి చివరికి తప్పనిసరిగా మీకు వ్రాస్తున్నాను.

నేను యీ రాత్రి చచ్చిపోవడానికి నిశ్చయించుకున్నాను. మీకోసం, నాకోసం. అందరిక్షేమంకోసం ఆలోచించే నిశ్చయించుకున్నాను. నాకోసం అట్టే దుఃఖించకండి. యీ వుత్తరమంతా చదివినప్పుడు, నాచావు మీకు కొంత శాంతినికూడా కలిగిస్తుందేమో! కాని జాలన్నా పడరూ? పడతారు. మీ హృదయం నాకు తెలుసు. నాకు తెలీకపోతే యింకెవరికి తెలుస్తుంది? నా ప్రేమనిమాత్రం—నిశ్చలమైన నా ప్రేమనిమాత్రం — సందేహించకండి. అది నేను సహించలేను సందేహించలేదని మీరు వుత్తరంరాసి, నన్ను ఆపుతారనిభయం. మీ ధర్మం అనుకునిఅపుతారుకాని, జాలిపడి క్షమించానంటారు గాని మీరు భరించలేరని నాకుతెలుసు. మీహృదయం నాకు

తెలీదూ ? తరవాత మనిద్దరి జీవితం దుర్భరమౌతుంది. నాకే మీమీద అంత ప్రేమ లేకపోతే, మీకే నామీద అంత కాంక్ష లేకపోతే, లోకంలో అందరిమల్లేవుంటే, మన మున్నూ.... యెట్లాగో కాపరంచేసేవాళ్ళమే .... యీపని జరిగింతరవాతకూడా.... కాని అంత గాఢమైన నిర్మల మైన ప్రేమలో కొంచెం అనృతదోషం, కొంచెం అపవిత్ర దోషం, అనుమానదోషం తగిలినా అంతా విషంగా పరిణ మిస్తుంది. వీల్లేదు. చావుతోనే పరిహారం చెయ్యాలి, యీ అక్రమాన్ని. విధి మిమ్మల్నీ, నన్నూ, మన ప్రేమనీ మింగి నాశనంచేసి ... యిద్దర్నీ ఆరుసంవత్సరాలు, సుందరమైన సంవత్సరాలు, కలిపి, మధుర బంధనాలతో కట్టి, యేకం చేసి, క్రూరంగా నవ్వుతో, హృదయంలేకండా ఒక్క నిమి షంలో చీల్చి, విడతీసి, చెరోమూలా ఈ అనంత ప్రపంచ వైశాల్యంలో యెక్కడో—యింక ఒకరికి ఒకరం అంద కండా—ఎంత యేడ్చినా, యెంత చేతులుజాచి వెతికినా లాభంలేకండా—పారేస్తోంది!.... రేపెక్కడ కళ్ళు తెరు స్తానో!.... ఒకవేళ నా ఆత్మ మీదగ్గిరికి రాగలిగితే, వొచ్చి నట్లు మీకు తెలియచేయగలిగితే, ఈ వుత్తరం చదివేప్పుడు మీదగ్గిర వుండగలిగితే.... మీ విచారం చూడగలనా ? నేను దగ్గిరే వున్నానని తెలపగలనా ?....

నా ప్రేమని మీరు సందేహించవద్దు. మీ దగ్గిరికి వొచ్చి, ఒక్కసారి, ఒక్కనిమిషం, నా ప్రేమతో, కన్నీ ళ్ళతో, ప్రమాణాలతో నా హృదయమంతామీదేనని, నా దేహం మలినమైనా, నా ప్రేమ నిర్మలమని తెలియచేయా

లని యెంతో వుంది. ఒక్కసారి మళ్ళీ మీ నవ్వే మొహాన్ని చూడాలని, నా వేపు కొంటెగా, మోహంతో చూసే మీ చూపు ననుభవించాలని, ప్రేమతో ఒక్కసారి పిలిపించుకోవాలని వుంది యెట్లా! నిజమండీ. ఒక్క నిమిషం కలలో నన్నా, మనసులో నన్నా ఇంకెవరినీ నేను కోరలేదు. యెప్పుడూ—మొదట నన్ను మీరు చూడ్డానికి వొచ్చిన నాటినించీకూడా—నా ఆలోచనలు, కోర్కెలు అన్నీ మీమీదనే. మీరు నమ్మరూ? చచ్చిపోతున్నాగా!.... యిప్పుడు నిజం చెప్పడానికింకేం? అవాళ సుబ్బారావు విషయమై, మీరు అనుమానపడ్డారుకదూ? నిర్మలమైన మీ కళ్ళలో ఆ స్వల్పమాలిన్యమే చెప్పింది నాకు. కాని మీరు వొప్పుకోలేదు. నిజమండీ. ఆ సుబ్బారావు నాకేం లెఖ్ఖ! అందమైనవాడని తెలుసు. అందమైనవాణ్ణని అతనికి తెలిసి, స్త్రీలందరూ తనని వొలిచి వొళ్ళో పడతారన్నట్టు చూస్తాడు. నావంక అట్టానే చూశాడు. మీరంత అప్యాయంగా అతని పరిచయం నాకు చేస్తే, అట్లాంటి భావంతో అతనుచూస్తే నాకెంతో డోకొచ్చింది! మీరు నమ్మారు కాదు. అతను ఆ వెంకటచలంగారి కథ చదువుతో వుంటే, ఆ కథలో ప్రేమ, నా ప్రేమవలె వుంటే జ్ఞాపకంలేదూ—మెడకింద చెయ్యేసిముఖం పైకెత్తడం మనమల్లెనే! యింకా పోసేండి ఇప్పుడెందుకు?—అందుకని శ్రద్ధతో కళ్ళతని మీదనే పెట్టుకునివినివుంటాను. కాని ఆసుబ్బారావుమీద మనసనుకున్నావనునాకు! ఇప్పుడన్నా నమ్ముతారా?.... యెన్నో

అనుకున్నాను. మీకు ప్రమోషన్ కాగానే, మనం ఆ చిన్న డాబాయిల్లు అద్దెకి తీసుకోడం, ఆవీధివేపు గదిలో మన మంచమూ అద్దమూ, పెట్టుకోడమూ, రాత్రి మీరుక్లబ్బునించి వొచ్చేప్పటికి నేను.... ఎందుకులెండిఅవన్నీ! నాకోసం అట్టే యాడవకండి.

ఆరాత్రి మీరు రెండునెల్లక్రిందట నన్ను వొదిలి బైటికివెళ్ళారు. ఆరాత్రి జ్ఞాపకముందా? అంతకుముందు ప్రతివారమూ మీరు వొస్తారు వొస్తారని యెదురుచూసి చూసి నిరాశచెందివున్నాను. చివరికి అనుకోకండా ఆరోజు మధ్యాహ్నంవొచ్చి, ఆరాత్రే మెయిలికి వెడతానన్నారు. మీ మొహంచూస్తోవుంటేకలిగినసంతోషమంతా,మిమ్మల్ని మళ్ళీ నెలరోజులు వదలాలనే దుఖ్ఖంలో కలిసి మాయమై పోయింది. బాధతో లాక్కుపొయ్యే గుండెల దడదడని అణచుకుని, మీకు పెదిమలమీద నవ్వునే కనపరచాను.

అలిసివొచ్చిన మీరు రాత్రి మంచంమీద పడుకోగానే నిద్రపోయినారు. ఎన్నిసార్లో తలుచుకుని తలుచుకుని ఉవ్విళ్లూరిన మీ సాన్నిధ్యాన్ని ప్రత్యక్షంగా కావిలించుకుని మహదానందంతో, మీ బుజంమీద తలపెట్టుకుని కళ్ళు మూసుకున్నాను. రాత్రంతా మీ ముఖాన్నీ, మీ పెద్ద కనుబొమ్మల్నీ, పల్చని చొక్కాకింద మీ గట్టి బుజాన్నీ సన్నని దీపపు వెలుగులో చూస్తో పడుకున్నాను. అలారంగడియారం నిమిషాల్ని వొక్కటొకటే చప్పుడు చేస్తోంది. దాన్ని విసిరి పగలకొడితే!.... కాని పాపం పొద్దున్నే మీ మొహంలో వుద్యోగం భయాన్ని చూడ

గలనా ?....మీ బుజంమీద నల్లి పాకింది. దాన్నికూడా ప్రేమించానారాత్రి. అదికూడా మిమ్మల్ని ప్రేమించి వొచ్చినట్టే కనబడ్డది. అట్లానే ప్రేమభారంతో కళ్ళు మూసుకుని మీ బుజంమీదే నిద్రపోయినాను. నిద్ర పోతున్నా రెండుగంటలైనట్టూ, మీరు లేచి వెళ్ళిపోతు న్నట్టు, నాకు కలవచ్చి చప్పున లేచాను. కాని మీ చక్కని దేహం నాచేతులకింద పడుకునేవుంది. మెల్లిగా లేచి గడియారంలోకి చూస్తే వొంటిగంటయింది. ఇంకా ఒకగంట. మిమ్మల్ని గట్టిగా ముద్దుపెట్టుకుంటే, మీ రొమ్ముమీద నాతలని అదుముకుంటే, మీకు మెళుకువ వొచ్చి, అప్పుడే ప్రయాణానికి సిద్ధమౌతారని భయం— కదలకుండా మీ గుండ్రని గడ్డంకేసి, కోల చెంపలకేసి నున్నని గోళ్ళలో కొనలు తేలే వేళ్ళకేసి, చూస్తున్నాను. మళ్ళీ కునుకుపట్టడమూ, అలారంకొడుతున్న చప్పుడైనట్టే మెళుకువరావడమూ, మిమ్మల్ని చిన్నచిన్న తేలికముద్దులు పెట్టుకోడమూ, గడియారంవంక చూడడముతో గడిచింది ఆ కాస్తకాలమూ. టంగ్ టంగ్ మన్నట్లు అనుకుని అను కుని, భయపడి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆ బాధ భరించలేక మిమ్మల్ని లేపి పంపెయ్యాలనిపించింది.

నిద్రకళ్ళతో నన్ను కడసారిచూసి వెళ్ళిపోయినారు. బండి వెడుతోవుంటే నేనుకూడా మీతో వొస్తోవుంటే ఎంతబావుండేది....అనుకుని ఆశపడ్డాను. కిటికీలోంచితొంగి చూశాను. దీపం వెలుతురులో మీకాలు చివరమాత్రం కనపడ్డది. అదే ఆఖరుసారి మిమ్మల్ని చూడడం మన

జన్మానికి. మీనించి విరహం భరించలేక, మీరు పడుకున్న చోటే, కొంచం సిగరెట్టు వాసనవేసే ఆ పక్కమీద, మీవంక తిరిగి మీరున్నట్టుగా భావించుకుంటో పడుకున్నాను. మీరున్నట్టే అయింది. మీచేతులు నాచుట్టూ వున్నట్టే, మిమ్మల్ని అనుకున్నట్టే అనుకున్నాను.........

ఎంతసేపయిందో, కలలో మీరు తిరిగివచ్చి నన్ను ముద్దుపెట్టుకున్నట్లు తోచింది. మెళుకువ వచ్చింది. కొంచెంగా నన్ను కావిలించుకుని ఎదురుగా వున్నారనుకున్నాను. యింకా కలా! ఆనందంలో, సుఖానుభవంలో, నాదేహం మూర్ఛపోతోంది. ఎంతో శాంతివొచ్చింది నా నరాలకి.

"మళ్ళీ వొచ్చారేం?"

మాట్లాడలేదు. ప్రేమతో నాచేతులు మెడచుట్టూ వేసి దగ్గిరికి ఇంకా అదుముకున్నాను. చంపలమీద చేతులు వేశాను. మీసాలులేవు. యెవరిది? వొదిలించుకోబోయినాను. పెనుగులాడుకున్నాను. కాని నా నరాలు నాకెదురు తిరిగాయి. నా శరీరమే నాకు తిరగబడి ద్రోహంచేసింది. మీరు మోహంతో నన్నుద్రేకింపచేసి, తృప్తిపరచక, వొదిలిన నిరాశవల్ల నాదేహం యెంత ప్రయత్నించినా కదలలేదు, స్వాధీనం తప్పింది, నాభర్త! నా ప్రేమ!.... అంటూను, అరుచుకుంటూను. మూడునెల్లనించి మిమ్మల్ని తలుచుకుంటో అణిచిపెట్టిన మోహతీవ్రత, మీరారాత్రి సంతృప్తి పరచని ఆవేదన, అంతా నన్ను ముంచేసి, దాసురాల్నిచేసి, నా నిశ్చయశక్తిని నోరునొక్కి నన్నిట్లా

చేసింది....వాడు, మీ పరమాప్తు....పోనీలెండి, వాడెవ రేమైతేనేం ? యెందుకు ?

ఆరోజునించి జాగ్రత్తగా వున్నాను. తలుపు గడియ వేసుకుంటున్నాను. వెంటనే మీదగ్గిరికివొచ్చి, మీతో అంతా చెప్పేసి, మీ కాళ్ళమీదపడి యేడిస్తే, మీరు కరుణిస్తారేమోనని ఆశపుట్టింది. మీదగ్గిరికి వొస్తాననికూడా రాశాను. జ్ఞాపకముందీ ? కాని వూరినించి వూరికి తిరుగుతో మీరు వీల్లేదన్నారు. మీకీ సంగతి రాయాలా కూడదా అని సందేహం పట్టుకుంది. చెపితే నన్ను వొది లేస్తారా ? అప్పుడు నేనెట్లా బతకను ? అనుకున్నాను. అందు కనే మీకు రాశానుకూడాను. జ్ఞాపకముందీ ? "ఒకావిడ యింకోడితో సంబంధం పెట్టుకుని తరవాత పశ్చాత్తాప పడ్డది. భర్త వొదిలెయ్యాలా, కూడదా ? యేది ధర్మం ? మీ అభిప్రాయమేమిటి ?" అని. మీ జవాబు చదివితే మీరు క్షమాపణ చూపేటట్టు కనబడలేదు. మీరు విప రీతమైన బాధపడతారని తెలుసు, తెలిస్తే ! మీరు నన్ను వొంటిమీద ముద్దుపెట్టుకుంటో "యిదంతా నాదేకదూ ! యింకోరు తాకితే భరించలేను !" అన్నప్పటి యీర్ష్యతో నిండిన మీ చూపులు జ్ఞాపకమొచ్చాయి. ఆలోచించి ఆలోచించి, మీతో చెప్పకూడదనుకున్నాను. "యెందుకు చెప్పడం ? యేంలాభం చెప్పి ? యింక మూణ్ణెల్లలో యిద్దరం యెప్పుడూ కలిసేవుంటాం, మీకు ప్రమోషన్ కాగానే ! యింక వాడేమి చేస్తాడు ?" అనుకున్నాను. కాని నా అదృష్టం యిట్లాపరిణమించింది. నా ఆశలన్నీ, సంతోష

మంతా ఇట్లా బుగ్గిలో కలిశాయి. నెలరోజులకిందటే మొదటి అనుమానం కలిగింది. నిజమేనేమో.... అని భయంతో, గిజగిజలాడాను. యేదోవొకటి తేలిందాకా రోజురోజు ఎట్లా గడిపానని! ప్రతిరోజూ ఎదురుచూస్తో, తప్పులెఖ్ఖ పెట్టానేమోనని కొన్నాళ్లూ, ఆలస్యానికి కారణం కల్పించుకుంటో కొన్నాళ్లూ, ఆశలేని ఆశతో గడిపాను. కాని మెల్లిగా స్థిరపడ్డది! ఇంక మీతో బొంకేదెట్లా? ఎన్నడూలేనిది ఇప్పుడే ఇది రావాలీ! పోనీ ఎట్లా నన్నా మిమ్మల్ని మోసపుచ్చి మీతో వుండేవిధమే వుండకూడదూ ?

మావాళ్ళకి తెలిసింది. మీకు సంతోషంగా వుత్తరం వ్రాశారు, ఈరోజు. ఆ వుత్తరం తరవాత ఇది అందితే మీమనసు ఎట్లా వుంటుంది? ఈపాటికే నన్ను సందేహిస్తోవుంటారుమీరు—ఈ వుత్తరం అందేటప్పటికే! పోనీ బతికేవుందామా అనుకుంటా! చచ్చిపోతున్నాను గనక నేను రాశిన యీ సంగతులు నమ్మతారేమోకాని బతికిఉండి మీతో చెప్పితే నమ్మతారా? నేనేదో కావలసి చేసి, ఈ పన్నాగం పన్నాననుకుంటారు. వీల్లేదు, నీళ్ళల్లో పడతానీరాత్రే. సెలవుమరి. ఇంకమళ్ళీ మీ మొహంచూడను. వొచ్చేజన్మలో మీరెవరో నేనెవరో! ఈ చివరినిమిషాలలో, మీతో గడిపిన అదృష్టపుదినాలూ, అమూల్యకాలమూ అంతా జ్ఞాపకమొస్తోంది. ఆరోజు తెల్లారకట్ట.... వొద్దులెండి. ఎందుకదంతా ఇప్పుడు?.... మళ్ళీ పెళ్ళిచేసుకుంటారా ?....